www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 31 మే 2025 5 ఏలూరు

మెగా జాబ్ మేళాలో 170 మంది ఎంపిక

నూజివీడు టౌన్ : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్‌మేళాకు రాష్ట్రంలో 13 ప్రముఖ కంపెనీ ప్రతినిధులు హాజరు కాగా 600 మంది యువతీ, యువకులు హాజరయ్యారని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.జితేంద్రబాబు తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన చేశామని తెలిపారు. అందులో వివిధ కంపెనీల ద్వారా 170 మంది అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు వి.రవిశ్యామ్, ఆర్.ఫణికుమార్, ఎస్.సునీల్‌కుమార్, కె.రాంబాబు, వి.కిషోర్, డి.రామకృష్ణనాయుడు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వారి టెక్నికల్ బృందం, ప్రజా ప్రతినిధులు, నిరుద్యోగ యువత, వారి కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించారు.. పరిష్కరిస్తారా..!

- సినిమా థియేటర్లలో తనిఖీలతో జనాల్లో చర్చ
- రెండు జిల్లాల్లో వందకుపైగా సినిమా థియేటర్లు
- తినుబండారాల ధరలు చూసి నోరెళ్లబెట్టిన అధికారులు
- ఐమాక్స్‌లో ఫ్యామిలీ ప్యాక్ పాప్‌కార్న్ ధర రూ.700 పైనే
- రెండు సమోసాలు రూ.70, గ్లాసు కూల్‌డ్రింక్ రూ.80
- ఐస్‌క్రీమ్ ధర రూ.వందపైనే, వాటర్‌బాటిల్ రూ. 50
- సినిమా టిక్కెట్ ధరలు రూ.50 నుంచి రూ.295 వరకూ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు చేయడంపై ప్రజల్లో విస్తృతమైన చర్చ సాగుతోంది. వినోదం పేరుతో సినిమా థియేటర్లలో ప్రజలను అడ్డంగా దోచేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది. సినిమా హాళ్లలో టిక్కెట్ ధరలతోపాటు తినుబండారాల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో సినిమా థియేటర్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. భారీగా డబ్బు వసూలు చేస్తున్న థియేటర్లలో కనీస సదుపాయాలు సైతం ఉండని పరిస్థితి. ఇటీవల డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల విషయంలో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు జిల్లాల్లో దాదాపు వంద సినిమా థియేటర్లు వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులోనే మల్టీప్లెక్స్ స్క్రీన్‌లు, థియేటర్లు కలిపి పది వరకూ ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోనూ స్క్రీన్లు, థియేటర్లు కలిపి 11 వరకూ ఉన్నాయి. అధికారుల తనిఖీల్లో చాలా థియేటర్లలో మరుగుదొడ్లలో శుభ్రత లేకపోవడం, తాగునీరు ఏర్పాటు వంటి కనీస సదుపాయాలు లేనట్లు అధికారులు గుర్తించారు. ఫైర్‌సేఫ్టీ వంటి నిబంధనలు సైతం సక్రమంగా లేనట్లు వెలుగులోకి వచ్చింది. అదే సమయంలో సినిమా థియేటర్లలో ముఖ్యంగా మల్టీప్లెక్స్‌ల్లో తినుబండారాల ధరలు చూసి తనిఖీలకు వెళ్లిన అధికారులు నోరెళ్లబెట్టిన పరిస్థితి ఉంది. సినిమా నిర్మాతలు వచ్చి అడిగిన వెంటనే కొత్త సినిమాలకు టిక్కెట్లు ధరలు ఇష్టానుసారంగా పెంచేయడమే తప్ప, థియేటర్లలో కనీస సదుపాయాలు, తినుబండారాల పేరుతో జరుగుతున్న దోపిడీ గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో సామాన్య ప్రజానీకానికి సినిమా వినోదం భారంగా మారిపోయింది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం సినిమాకు వెళ్లాలంటే తక్కువలో తక్కువగా రూ.రెండు వేలు ఖర్చవుతోంది. అదీ అతి జాగ్రత్తగా ఖర్చుపెడితే మాత్రమే. సినిమా థియేటర్లలో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఉచితంగా కల్పించాలని నిబంధనలు చెబుతున్నా ప్రతిచోటా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగే నాథుడే లేకుండాపోయాడు. సినిమా థియేటర్ల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఎట్టకేలకు పవన్‌కల్యాణ్ సినిమా వివాదంతో ఇప్పుడు అధికారులు ప్రత్యేకంగా థియేటర్లలో తనిఖీలు చేయడంతో సమస్యలన్నీ తెరపైకొచ్చాయి.

ధరలు చూసి దడదడ..!

సినిమా థియేటర్లలో తినుబండారాల ధరలు చూసి అధికారులు సైతం దడదడలాడిన పరిస్థితి ఉంది. పాప్‌కార్న్ మినీ సైజ్ రూ.370కు విక్రయిస్తుండగా, ఫ్యామిలీ ప్యాక్ రూ.700కుపైగానే ఉంది. వాటి ధర బయటి మార్కెట్‌లో రూ.వందలోపే ఉంది. దీన్ని బట్టి ఎన్నిరెట్లు ఎక్కువ ధరకు పాప్‌కార్న్ అమ్ముతున్నారో వేరే చెప్పనక్కర్లేదు. కూల్ డ్రింక్ గ్లాస్ రూ.80కు విక్రయిస్తున్నారు. బయట ధర రూ.20కు మించి లేదు. వాటర్ బాటిల్ ధర బహిరంగ మార్కెట్లో రూ.20 ఉండగా, సినిమా హాళ్లలో రూ.50కు విక్రయిస్తున్నారు. రూ.30 ఖరీదు చేసే ఐస్‌క్రీమ్ రూ.వందకుపైగా అమ్ముతున్నారు. రెండు సమోసాలు రూ.70కు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. సినిమా హాళ్లలో విక్రయించే తినుబండారాల నాణ్యతపైనా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ఉదయం షోకు చేసిన సమోసాలు విక్రయం కాకపోతే రాత్రి ఫస్ట్‌షో సమయంలోనూ విక్రయిస్తుంటారు. సినిమా థియేటర్లలో తినుబండారాల అమ్మకాల్లో జరుగుతున్న దోపిడీ అంతాఇంతా కాదు. అయినప్పటికీ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. ఇక సినిమా టిక్కెట్ల ధరకు వస్తే ఐమాక్స్ థియేటర్‌లో రిక్లయినర్ ధర రూ.295 ఉండగా, తర్వాత టిక్కెట్ ధర టిక్కెట్ రూ.170 వరకూ ఉంది. ఇతర సినిమా థియేటర్లలో రూ.150 నుంచి రూ.50 వరకూ టిక్కెట్ల ధరలు ఉన్నాయి. కొత్త సినిమాలకు అదనంగా టిక్కెట్ల ధర పెంపు ఉంటుంది. సినిమా థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకుడిని నిలువునా దోచేస్తున్న పరిస్థితి ఉంది. సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులు సమస్యలను గుర్తించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

నేడు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

2,58,804 మంది పింఛన్‌దారులకు రూ.113.00 కోట్లు విడుదల

స్వాజ్ కింద మంజూరైన 2,967 పెన్షన్లు జూన్ 12న పంపిణీ

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్‌టిఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే జూన్ నెల ఫించన్లను ఈ నెల 31నే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జూన్ నెల పింఛన్ల పంపిణీ ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం ఏడు గంటలకల్లా ప్రారంభించాలన్నారు. శనివారం ఏదైనా కారణం చేత తీసుకోని వారికి జూన్ 2వ తేదీన పంపిణీ చేస్తారన్నారు. పింఛన్లు ముందస్తు పంపిణీ విషయాన్ని లబ్దిదారులకు వ్యక్తిగతంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జూన్ నెల ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి 2,58,804 మంది పింఛన్‌దారులకు రూ.113 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వీలైనంతవరకు ఈ నెల మే 31నే నూరుశాతం పంపిణీ పూర్తి చేసేలా అధికారులంతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో స్పౌజ్ పెన్షన్ల కింద మంజూరైన 2,967 పెన్షన్లను జూన్ 12న ప్రత్యేక కార్యక్రమం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి, డిపిఒ కె.అనురాధలను కలెక్టర్ ఆదేశించారు.

3 రోజులుగా తాగునీరు లేదు..!

కెవిపిఎస్ ఆధ్వర్యాన రెడ్డిగణపవరం వాసుల నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో ఎస్‌సి దళిత పేటలో మూడు రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత ప్రజల పట్ల పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వీడాలని, ప్రజలకు వెంటనే తాగునీరు అందించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దళితపేటలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బక్క శివ, రెండో వార్డ్ సభ్యురాలు కె.ఝాన్సీ, పి.రాధ, కె.బాబూరావు, కె.విమల, పి.కుమారి, కె.జ్యోతి, యు.నాగమ్మ, కె.నూకాలమ్మ, భవాని, పండు, కె.గౌరమ్మ, కె.కొండయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రెడ్డిగణపవరం వాసులు

పెంచిన ఆస్తిపన్ను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కూటమి ప్రభుత్వం పెంచిన ఆస్తిపన్ను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ కమిటీ తరపున జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ఆస్తి పన్నును 20 శాతం పెంచాలని నిర్ణయించి, ఆ మేరకు కొలతలు వేసే సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. గతంలో ఇంటి అద్దె ఆధారంగా పన్నులు వేస్తే నేడు భూమితో కలుపుకుని ఆస్తి విలువను అంచనా వేసి దాని ఆధారంగా ఆస్తిపన్ను నిర్ణయించే పద్ధతికి ప్రభుత్వాలు వచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగానే ఆస్తిపన్ను పెంచే విధానానికి గత వైసిపి ప్రభుత్వం 2020లో ఒక ఆర్డినెన్స్‌ను, దాని ఆధారంగా జిఒ నెం.198ని తీసుకురావడంతో ప్రజలంతా వ్యతిరేకించారని పేర్కొన్నారు. దాంతో వెనక్కి తగ్గిన ఆనాటి ప్రభుత్వం సంవత్సరానికి 15 శాతం మాత్రమే ఆస్తి పన్ను పెంచుతామని చెప్పిందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రజలతోపాటు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి కూడా వ్యతిరేకించి ఆందోళనలు చేసిందని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో ఆస్తి పన్ను పెంచబోమని హామీ ఇచ్చి ఏరు దాటగానే తెప్ప తగులబెట్టినట్లు కూటమి ప్రభుత్వం హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. దీంతో ఏలూరు జిల్లాలో దాదాపుగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో రూ.7.72 కోట్లు, నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో రూ.1.40 కోట్లు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో రూ.1.56 కోట్లు, చింతలపూడి మున్సిపాలిటీ పరిధిలో రూ.32 లక్షలు జిల్లా మొత్తంగా రూ.11 కోట్ల భారం ప్రజలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ భారాలు కేవలం ఇంటి యజమానులకే కాకుండా అద్దెకు ఉండేవారిపైనా పడుతుందని పేర్కొన్నారు. గతంలో విద్యుత్ భారాలు మోపిన సందర్భంగా అధికారాన్ని కోల్పోయిన విషయాన్ని తెలుగుదేశం ప్రభుత్వం గుర్తు తెచ్చుకొని నేడు ప్రజలపై ఆస్తిపన్ను భారాన్ని ఆపాలని హితవు పలికారు. లేనిపక్షంలో సిపిఎం కలిసొచ్చే వారందరినీ కలుపుకుని ప్రజలతో కలిసి ఆస్తి పన్ను పెంపునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

క్షయరహిత సమాజమే లక్ష్యం

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

క్షయరహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, దీనికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి నిర్మూలన అవగాహనా పోస్టర్లను, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ పోషణ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్నవారు సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకుని మందులు వాడాలని సూచించారు. ప్రధాన మంత్రి టిబి.ముక్త్ భారత అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనికోసం ని-క్షయ్ సంపర్క్ హెల్ప్‌లైన్ 1800-11-6666 టోల్‌ఫ్రీని సంప్రదించవచ్చన్నారు. టిబిని చికిత్స ద్వారానే కాకుండా నివారణ ద్వారా కూడా ఓడించాలన్నారు. దగ్గుమాత్రమే టిబి లక్షణం కాదని, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం పడటం, జ్వరం, ఛాతిలో నొప్పి, అలసట, నీరసం, ఏదైనా శరీరభాగంలో గుళ్లలు, వాపు రావడం వంటి లక్షణాలు కన్పిస్తే సమీప ఆరోగ్యకార్యకర్తను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలిని, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎఎస్ఆర్ నగర్‌ను పంచాయతీగా గుర్తించాలి

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న అల్లూరి సీతారామరాజు నగర్ (ఎఎస్ఆర్ నగర్) గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలని, గ్రామానికి తాగునీరు, రోడ్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం బైటాయించారు. ఆందోళన నిర్వహించిన అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు గూడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా రెక్కాడితే గాని డొక్కాడని కొందరు పేదలు ఎఎస్ఆర్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పంచాయతీ ఆ గ్రామాన్ని గుర్తించకుండా ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 17 ఏళ్లుగా గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు ఎన్ని వినతిపత్రాలు అందించినా ఫలితంలేదని, పాలకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయంలో సాక్షాత్తు హైకోర్టు వారు గ్రామానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ గ్రామ ప్రజలకు అందని ద్రాక్షాగా మారిందన్నారు. ఎన్నికల ముందు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సొంత నిధులతో తాగునీటి ట్యాంకు నిర్మిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారని విమర్శించారు. ప్రభుత్వ భూమిలో ఇళ్లు వేసుకుని నివాసం ఉండేవారికి విద్యుత్, తాగునీరు ఇచ్చేదిలేదంటూ స్థానిక పంచాయతీ అధికారులు అంటున్నారని వాపోయారు. జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే కొంతమంది పెత్తందారులకు ప్రభుత్వ భూమిని దారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఎంఎల్ఎ ఇచ్చిన మాట నిలబెట్టుకొని గ్రామానికి కరెంటు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, అనుముల మురళి, మడక కుమారి, శిరీష, బరగడ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు, ఎఎస్ఆర్ నగర్ వాసులు

నిబంధనలు పాటించని 152 బస్సులపై కేసులు

రూ.5 లక్షల జరిమానా

జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.ఐదు లక్షల జరిమానా విధించామని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. జిల్లాలో నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు ప్రాంతాల్లో ప్రయివేటు ట్రావెల్స్ కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై రెండు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. దీనిలో భాగంగా విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ మార్గంలో తిరిగే కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. సాధారణంగా కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు ఒక పాయింట్ నుండి మొదలై గమ్యస్థానంలో మాత్రమే ఆగాలని, అయితే అందుకు పూర్తి విరుద్ధంగా ఒక పాయింట్ నుంచి మొదలైన బస్సు దాదాపు 20 పాయింట్లలో ఆగుతున్నట్లు గుర్తించామని వివరించారు. ఆయా బస్సుల నిర్వాహకులుపై కేసులు నమోదు చేశామని తెలిపారు. మొత్తంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 152 బస్సులపై కేసులు నమోదు చేశామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏలూరు ఆర్‌టిఒ కెఎస్ఎంఎన్.కృష్ణారావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎమ్‌డి.మదాని, వాహన తనిఖీ అధికారులు ఎస్.రంగనాయకులు, జివి.ప్రసాద్‌రావు, జి.స్వామి, వై.సురేష్‌బాబు, వైవి.కళ్యాణి, కృష్ణవేణి, టి.నరేంద్రబాబు, అన్నపూర్ణ, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

కూలిన పాఠశాల భవనం స్లాబు

సెలవు రోజులు కావడంతో తప్పిన పెను ముప్పు

ప్రజాశక్తి - భీమడోలు (ఉంగుటూరు)

భీమడోలు మండలం పొలసానిపల్లిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ భవనం పై కప్పు సైన్స్ తరగతి గదిలో కూలిపోయింది. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ కోసం శుక్రవారం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు చూడటంతో కూలిపోయిన విషయం వెలుగులోకి వచ్చింది. గురువారం అర్ధరాత్రి దాటాక కూలిపోయినట్లు భావిస్తున్నారు. భవనం పైకప్పు శిథిలావస్థకు చేరింది. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, లేకుంటే జరిగే ప్రమాదాన్ని ఊహించుకుంటే భయం వేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని పూర్తిగా తొలగించి విద్యార్థులను కాపాడాలని కోరుతున్నారు.

కూలిన పాఠశాల స్లాబు

ఆర్‌జియుకెటి నూజివీడులో సర్టిఫికెట్ల ధ్రువీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో 2025-26 అడ్మిషన్లకు సంబంధించి నాలుగు రోజుల సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమం శుక్రవారం మూడోరోజు కొనసాగింది. శుక్రవారం క్రీడలు, ఎన్‌సిసి కోటాలకు చెందిన అభ్యర్థుల సర్టిఫికెట్లు ధ్రువీకరించారు. క్రీడల కోటాలో 467 మందికి 344 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్‌సిసి క్యాటగిరికి 452 మంది 354 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్, ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర పర్యవేక్షించారు. ప్రొఫెసర్ గోపాలరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధ్రువీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యాసంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. రేపు చివరి రోజు ఎన్‌సిసి కేటగిరిలో 661 మంది హాజరు కానున్నట్లు ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పదవుల కేటాయింలేవీ..!

చింతలపూడి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల ప్రశ్న

ప్రాధాన్యత ఉన్నా చిన్నచూపేనా అని ఆవేదన

ఆ మేరకు ఎంపీ, ఎంఎల్ఎ కృషి చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గం టిడిపికి కంచుకోట అని, రాష్ట్రంలో ఇక్కడ రాజకీయం కీలకమని, ఇక్కడ నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేస్తే అభ్యర్థి ఎవరైనా గెలుపు మాత్రం టిడిపిదేనని, ఎటువంటి ప్రలోభాలు పనిచేయవని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటి చింతలపూడి నియోజకవర్గానికి రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు ఎందుకు కేటాయించడంలేదని విశ్లేషకులతో పాటు మండలంలోని నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో సీనియర్ నాయకులకు, యువతకు, యువ నాయకులకు కొదవలేదని, క్రమశిక్షణతో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసేవారూ ఉన్నా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు ఎందుకు కేటాంచటం లేదని ప్రశ్నార్థకంగా మిగిలిందని చెబుతున్నారు. లేదా ఆ దిశగా ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయడం లేదా అని సందేహిస్తున్నారు. టిడిపి ఏర్పాటు చేసినప్పటి నుంచి పార్టీని నమ్ముకున్న సీనియర్ నాయకులూ లేకపోలేదని, పార్టీని నడిపించే బలోపేతం చేసే సత్తా ఉన్న నాయకులు, జనం బలం, ధన బలం కలిగిన నాయకులూ ఉన్నారని అయినా ఎందుకు కేటాయింపులు జరగడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చింతలపూడి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1983 నుంచి 1999 వరకు, 2014 నుంచి 2019 వరకు, ప్రస్తుతం 2024 నుంచి టిడిపి హవా కొనసాగుతుంది. నియోజకవర్గంలో ఏ సమావేశం పెట్టినా విజయవంతమయ్యేదని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా నియోజకవర్గంలో టిడిపి గెలిస్తే రాష్ట్రంలో కూడా గెలుస్తుందనే సెంటిమెంట్ కూడా ఉందని, అలాంటి చింతలపూడి నియోజకవర్గానికి రాష్ట్ర, జిల్లా స్థాయి పదవుల్లో అన్యాయం జరుగుతుందని తెలుగుతమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. 2019లో టిడిపి కష్ట కాలంలో ఉన్నప్పుడు సీనియర్ నాయకులు కొంతమంది వెనక్కి తగ్గినా పార్టీ అభిమానులు, జంగారెడ్డిగూడేనికి చెందిన దాసరి శేషు, గోలి అనిల్, లాగు సురేష్, మన్యం దుర్గారావు, డోలా విజయ్, పల్లి శ్రీను, నత్త నాగేంద్ర, నందిగం బాబి బోడ అనీష్, కొండ్రు దేవా, సత్తిబాబు, మరి కొంతమంది యువత నిలబడ్డారని, వారిపై కేసులు పెట్టినా, బెదిరించినా, వెనకడుగు వేయకుండా పార్టీ కోసం నిలబడ్డారని నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.

అలాంటి యువతకు పార్టీ అధిష్టానం నుంచి నామినేటెడ్ పదవులు వస్తే బాగుంటుందని అనుకుంటున్నారు. అలాగే పార్టీ సీనియర్ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, గుత్తా సాయివరప్రసాదరావు, కోనేరు సుబ్బారావు, గుల్లపూడి శ్రీనివాసరావు, ఆకుమర్తి రామారావు, ఘంటా సుధీర్, హరిబాబు, ముసునూరు రాము, బోడా నాగభూషణం, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీతో పాటు ఇంకా చాలామంది సీనియర్ నాయకులు కూడా ఉన్నారని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. పార్టీ కోసం పనిచేసినవారికి, యువ, సీనియర్ నాయకులకు రాష్ట్రచ జిల్లా స్థాయి పదవులు వచ్చే విధంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూపడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పట్టుదలతో కృషి చేయాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.

ఆపరేషన్ కగార్ ఆపాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆపరేషన్ కగార్ ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నక్సలైట్ల రహిత భారతదేశాన్ని 2026 నాటికి దేశ ప్రజలకు చూపిస్తామని చెబుతూ అడవి మీద ఆధారపడి జీవిస్తూ, అక్షర జ్ఞానం లేని అమాయకులైన గిరిజనులను అడవి నుంచి దూరంగా తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోడీ, అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులు కేంద్రంతో చర్చలకు సిద్ధమని బహిరంగంగా తెలియజేస్తున్నా వారితో చర్చించకుండా వారిని చంపడం మానవ హక్కుల ఉల్లంఘన చేసినట్లేనని, ఆపరేషన్ కగార్ కేంద్రం ఇప్పటికైనా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోకపోతే కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు మందా క్రాంతి కుమార్, సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు

నిర్వాసితులకు వివాదాల్లేని భూములివ్వాలి

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కింద పంపిణీ చేసేందుకు గిరిజనుల సాగులో ఉన్న భూములను సేకరించేందుకు ప్రయత్నించడం తగదని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. ఆ పార్టీ రెడ్డిగణపవరం గ్రామ కమిటీ సమావేశం కొరసా జలపాలు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి (ఆర్అండ్ఆర్) కింద కొనుగోలు చేస్తున్న భూములు అత్యధిక వివాదం ఉన్న భూములను కొనుగోలు చేయాలని చూస్తున్నారని, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, విఆర్పురం మండలాల్లో నిర్వాసితులకు బుట్టాయగూడెం మండలంలో భూసేకరణ చేస్తున్నారన్నారు. ఈ భూసేకరణలో అత్యధిక భూములను గిరిజనుల సాగులో ఉన్నవేనని, వివాదం లేని భూములను పోలవరం నిర్వాసితులకు ఇవ్వాలి తప్ప 30 ఏళ్ల నుంచి గిరిజన సాగులో ఉన్న ఎల్టిఆర్, 1/70 చట్టం భూములు కొనుగోలు చేయాలని చూస్తున్నారని అన్నారు. రెడ్డిగణపవరం, ఇనుమూరు గ్రామంలోని గిరిజన సాగులో ఉన్న భూములు కూడా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి కింద కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. వీటిని తక్షణమే ఆపాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఎటువంటి వివాదాలూ లేని భూములను కొనుగోలు చేయాలని కోరారు. కొంతమంది అధికారులు కాసులకు కక్కుర్తి పడి వివాదాల్లో ఉన్న భూములను ఆర్అండ్ఆర్లో పెట్టేందుకు చూస్తున్నారని, వీటిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎటువంటి వివాదాలూ లేని భూములను నిర్వాసితులకు కొనుగోలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెట్టి వీరయ్య, ఉనుముల సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు పెద్దపీట

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

నియోజకవర్గంలో ప్రజా అవసరాలకు పెద్దపీట వేస్తూ రూ.కోట్లు వెచ్చించి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. గవరవరంలోని సెయింట్ ఆన్స్ కాలేజీ నుంచి సత్రంపాడు అడ్డరోడ్డు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక బిషప్ హౌస్ వద్ద ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజా అవసరాలను గుర్తించడంలో కూటమి ప్రభుత్వమెప్పుడూ ముందుంటుందన్నారు. ఇదేక్రమంలో గత 40 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన రహదారి నిర్మాణానికి శరవేగంగా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు ఆర్అండ్బి మంత్రితో మాట్లాడి రూ.90 లక్షల నిధులను కూడా తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ రోడ్డును నిర్మించేందుకు 26 విద్యుత్ స్తంభాలను మార్చాలన్నారు. దానిపై సంబంధిత అధికారులతో మాట్లాడి, అందుకు అవసరమైన రూ.5.20 లక్షల నిధులను కూడా కార్పొరేషన్ నుంచి కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, నాయకులు అమరావతి అశోక్, గూడవల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి శుక్రవారం పల్లె వెలుగు, స్వర్ణ గ్రామం, పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ అన్నారు. మండలంలోని చింతంపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల, కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. అధికారులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్

గ్రామాలాభివృద్ధిలో దాతల సాయం అభినందనీయం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

గ్రామాలాభివృద్ధిలో దాతల సహకారం ఎంతో అభినందనీయమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం వట్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కీర్తిశేషులు ధూళిపాల ఆదినారాయణ చౌదరి జ్ఞాపకార్థం వారి సతీమణి ధూళిపాల రాధాకుమారి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన అసెంబ్లీ హాల్ ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇదే గ్రామంలో పుట్టి, ఇక్కడే విద్యను అభ్యసించి నేడు ఉన్నత స్థానాలను అధిరోహించిన ధూళిపాళ భానుప్రకాష్ వారి సన్నిహితులుతో కలిసి నార్త్ అమెరికా తెలుగుసంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని తెలిపారు. ఆయన తండ్రి ధూళిపాళ ఆదినారాయణ చౌదరి జ్ఞాపకార్థం ఆయన తల్లి ఆర్థిక సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసెంబ్లీ హాల్ ప్రాంగణాన్ని కూడా నూతనంగా నిర్మించి, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలనే వారి ఆకాంక్షను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎఎంసి ఛైర్మన్ గారపాటి రామసీత, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, పార్టీ మండలాధ్యక్షులు మరడాని రవి, క్లస్టర్ ఇన్ఛార్జి గుత్తా అనిల్ సహా పలువురు కూటమి నాయకులు, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడని...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫోన్ నెంబర్ బ్లాక్లో పెట్టాడని మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలానికి చెందిన ఓ బాలిక ఏడో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో ఇంటికి సమీపంలో ఉండే 20 ఏళ్ల యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. గత సంవత్సర కాలంగా వీరు ప్రేమించుకున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో బాలిక ఫోన్ నెంబర్ను ఐదు రోజుల నుంచి యువకుడు బ్లాక్లో పెట్టాడు. ఎంతకీ ఫోన్ కలవకపోవడంతో అతను తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడని తెలుసుకున్న బాలిక మనస్తాపానికి గురై గురువారం రాత్రి గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన బంధువులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పెదవేగి పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసగాడు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర మంత్రులతో సన్నిహిత్యం ఉన్నట్లు నమ్మించి రూ.మూడు లక్షలు తీసుకుని నకిలీ సంతకాలతో అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చి మోసం చేసిన కేసులో హైదరాబాదుకు చెందిన షేక్ రసూల్ కలకాడను భీమడోలు పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు. కేసుకు సంబంధించి వివరాలను భీమడోలు సిఐ యుజె.విల్సన్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఇతనికి పలు కేసులతో సంబంధం ఉందన్నారు. నిందితుడు షేక్ రసూల్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తానని నకిలీ అపాయింట్మెంట్ లెటర్లు ఇచ్చి డబ్బులు దోచుకోవడంలో సిద్ధహస్తుడన్నారు. అతని రెండో కుమారుడు అల్తాఫ్ కూడా నకిలీ సంతకాలతో లెటర్లు తయారు చేస్తుంటారని పోలీసులు చెప్పారు. పూళ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పోలీసు శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20 లక్షలు తీసుకున్న కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని వెల్లడించారు. దేవినేనివారిగూడేనికి చెందిన సుంకవల్లి శ్రావణ్ కుమార్ పొలాన్ని కాజేయాలనే పన్నాగంతో నకిలీ చెక్కులు ఇచ్చి మోసం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో కేసు దర్యాప్తుచేసి నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ వై.సుధాకర్, హెడ్కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్కెఎస్.బాజీ, కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరావులను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిరుపేద విద్యార్థులకు అత్యుత్తమ విలువల విద్య

ప్రకృతి ఒడిలో ప్రామాణిక విద్యాబోధన
బాలభారత్ విద్యానికేతన్ సొంతం
కరస్పాండెంట్ కృష్ణారావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అత్యుత్తమ విలువలతో కూడిన చదువును చేరువ చేయడమే లక్ష్యంగా వేణు మాస్టార్ స్కూల్గా పిలువబడే బాలభారత్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సిద్ధాంతమని కరస్పాండెంట్ జివి.కృష్ణారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలోని తుక్కులూరు గ్రామంలో హనుమాన్ జంక్షన్ - నూజివీడు ప్రధానమైన ఎంఎస్కె రహదారి పక్కనే ప్రకృతి ఒడిలో క్రమశిక్షణ ప్రధాన అంశంగా, సామాజిక మానవీయ విలువలు నేర్పుతూ, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా పాఠశాల ఆదర్శవంతంగా కొనసాగుతోందన్నారు. తన తండ్రి జివిఎన్జి.వేణుగోపాలరావు (వేణు) 1983 ప్రాంతంలో కాన్వెంట్గా ప్రారంభించి ఎన్నో గొప్ప ఆశయాలతో కొనసాగించినట్లు చెప్పారు. చురుకైన, ప్రతిభగల విద్యార్థులకు చదువు చెప్పడం గొప్ప కాదని, క్రమశిక్షణతో కూడిన చదువును నేర్పడం ద్వారా అత్యుత్తమ భారత పౌరులుగా తీర్చిదిద్దడం గురువు బాధ్యతగా స్వీకరించాలని తన తండ్రి వేణు చూపిన బాటలో తాను పయనిస్తున్నానని కృష్ణారావు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా అత్యుత్తమ విలువలతో కొనసాగి 2004లో ఏడో తరగతి వరకు 300 మంది విద్యార్థులు, పది మంది ఉపాధ్యాయులతో అన్ని రకాల అనుమతులతో పాఠశాల విద్యాబోధన అందించినట్లు చెప్పారు. 2010 నుంచి పదో తరగతి విద్యను అందించామన్నారు. నేడు పాఠశాలలో 500 మంది విద్యార్థులు, 20 మంది సిబ్బందితో విద్యాబోధన చేస్తున్నామన్నారు. పాఠశాల సమీపంలోని ఏడు గ్రామాల్లోని అనేక కుటుంబాలకు చెందిన విద్యార్థులు తమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. సువిశాలమైన సుమారు ఎకరం విస్తీర్ణంలో పచ్చని చెట్ల మధ్య గురుకులాన్ని తలపిస్తూ సంప్రదాయబద్ధంగా పాఠశాలలో విద్యాబోధన కొనసాగుతోందన్నారు. పబ్లిసిటీకి దూరంగా ఉండే పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థి పలగాని రామాంజనేయులు 580 మార్కులు, 500కు పైగా 15 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు విదేశాల్లో, ఉద్యోగులుగా, ఇంజినీర్లుగా, మరెన్నో రంగాలలో స్థిరపడ్డారన్నారు. ఏ కార్పొరేట్ విద్యాసంస్థ, ప్రయివేట్ విద్యాసంస్థ పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువు చెప్పేందుకు ముందుకు రాకపోవచ్చు అని, తమ పాఠశాలలో అలాంటి భేదభావం లేకుండా చదువు కావాలనుకునే ప్రతిఒక్కరికీ విద్యాబోధన చేస్తామని చెప్పారు. ఎంతో గొప్పగా నిర్వహించే చిల్డ్రన్స్ డే రోజున వివిధ రకాల పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, పోటీతత్వం పెంపొంది సమాజంలో విజేతలుగా నిలిచేందుకు పునాదులు ఏర్పడుతున్నట్లు సోదాహరణంగా వివరించారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం, సురక్షిత మినరల్ వాటర్, హైజెనిక్గా ఉండే మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు చెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో మార్కుల వేటలో పడి క్రమశిక్షణ మరిచిపోతున్న సంఘటనలు చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. విద్యార్థి దశలో ముందుగా క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ ఏర్పడితే అన్ని అంశాల్లోనూ ఆ విద్యార్థి ప్రతిభ కనపరచడం ఎంతో సులువని తెలిపారు. తమ పాఠశాల విలువలకు కట్టుబడి పాతికేళ్లుగా విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులు నేటికీ కొనసాగడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. మార్కులు ఒక్కటే జీవితం కాకూడదని, మానవీయ విలువలు ప్రతి విద్యార్థి నేర్చుకోవాలన్నారు. అందుకోసం తమ వంతు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బాలభారత్ విద్యానికేతన్ విద్యార్థి అనగానే క్రమశిక్షణకు మారుపేరుగా మంచి పేరు తన తండ్రి వేణు మాస్టర్ మార్గదర్శకత్వంలో సాధించనున్నట్లు తెలిపారు.



వేణుగోపాలరావు (ఫైల్)



కరస్పాండెంట్ కృష్ణారావు

బాలభారత్ విద్యానికేతన్ స్కూల్

ఐక్యత - పోరాటం సిఐటియు నినాదం

ఘనంగా 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఏలూరులో...

చింతలపూడిలో....

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవనం వద్ద శుక్రవారం సిఐటియు జెండాను జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్విడి.ప్రసాద్ మాట్లాడుతూ సిఐటియు 1970 మే 30న ఏర్పడిందన్నారు. ఈ 55 సంవత్సరాల కాలంలో అనేక చారిత్రాత్మకమైనటువంటి పోరాటాలు నిర్వహించిందన్నారు. సిఐటియు ఐక్యత-పోరాటం అనే నినాదంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, వివిఎస్.ప్రసాద్, మొహిద్దీన్, కోటేశ్వరరావు, శ్రీలక్ష్మి, మావూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే సిఐటియు లక్ష్యమని, రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పలువురు వక్తలు అన్నారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కెజెఎస్.సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్విడి.ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్బాబు మాట్లాడారు. తొలుత యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు జెండా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి కెజెఎస్.సత్యనారాయణ కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, కారు దుర్గారావు, బంగారు శంకరరావు, తేగల సత్యవతి, దుర్గ, అమ్మాజీ, నరమామిడి నాగమణి, శిరీష, తానంకి జార్జి, మరియన్న తదితరులు నాయకత్వం వహించారు. వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు. జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, జంగారెడ్డిగూడెం యూనియన్ అధ్యక్షులు ఆర్.నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, కోశాధికారి వి.రాజు, తదితరులు పాల్గొన్నారు

కొయ్యలగూడెం : ఐక్యత పోరాటం నినాదంతో 1970లో మే 30న సిఐటియు ఏర్పడి 55 ఏళ్లు అయిందని, కార్మికులకు, ఉద్యోగులకు సిఐటియు అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు శభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

చింతలపూడి : చింతలపూడి సిఐటియు కార్యాలయం వద్ద, సీతానగరం పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్విఎస్.నారాయణ మాట్లాడారు. సిఐటియు జెండాను సిఐటియు మండల కార్యదర్శి, బాలరాజు, బాలకృష్ణ ఎగురవేశారు. ఈ

ముసునూరులో...

కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకురాలు పుణ్యవతి, లక్ష్మీ ప్రియ, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఎన్.సరోజిని, టి.మాణిక్యం, మున్సిపల్ రంగ యూనియన్ నాయకులు పద్మ, వల్లి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఝాన్సీ, జ్యోతి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో, భువనపల్లిలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కోన జయమ్మ, వరలక్ష్మి, లావేటి సోంబాబు, కానూరు రాజు, జోరిగే బాబి, ధనలక్ష్మి, నాగేశ్వరి పాల్గొన్నారు.

కుక్కునూరు : మండలంలో పది చోట్ల జెండా ఆవిష్కరణలు చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో జిసిసి కార్యాలయం వద్ద సిఐటియు జెండాను మండల కార్యదర్శి సాయికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల కోశాధికారి బాడీస సుజాత, ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా, సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, గిరిజన సంఘం మండలాధ్యక్షులు శ్యామల లక్ష్మణరావు, డివైఎఫ్ఐ నాయకులు పులదాసు రమేష్, నాయకులు నిర్మల వెంకటేశ్వర్లు, కారం రమేష్, అన్నపూర్ణ, మంగ, భవాని, ముత్తేష్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : కార్మిక, కర్షక యూనియన్లకు సిఐటియు ఎంతగానో అండగా ఉంటుందని మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెరిచర్ల నాగరాజు, అశోక్, రెడ్డి తిరుపతిరావు, ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు : సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లోని ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆటో స్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. ఉపాధి హామీ శ్రామికుల వద్ద పని వేళలో సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యులు బీరం అంజి, అశోక్, బంధం చంటి, లాడే వెంకటేష్, మిడ్ డే మీల్స్ వర్కర్ నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : నెక్కలం గొల్లగూడెంలోని కుశలవ కంపెనీ వద్ద సిఐటియు నాయకులు కెవికె.ప్రసాద్, ఆగిరిపల్లిలో ఎన్.ఊళక్కయ్య, ఈదులగూడెంలో సుభాకర్ సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.నరేష్, ఆర్.చంటి, జహంగీర్ భాషా, స్టాలిన్, కిరణ్, రాంబాబు, వెంకటేష్, ఆదిత్య, సాయిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమలులో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉపాధి హామీ చట్టంలో పొందు పరచిన అంశాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) మండల కార్యదర్శి తాడిగడప జయరాజు విమర్శించారు. స్థానిక పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను శుక్రవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జాబ్ కార్డు కలిగి ఉండి ఉపాధి కల్పించని కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పట్టణంలో డ్రెయినేజీల నిర్మాణం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని కొన్ని వార్డుల్లో కొత్త డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆమె ఆధ్వర్యంలో సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. పట్టణంలో అనేక అభివృద్ధి పనులు ఉన్నాయని, వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కౌన్సిలర్లు వారి వార్డుల్లో ఉన్న కొన్ని సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి

డ్రైడే ఆచరణతో దోమల వృద్ధికి అడ్డుకట్ట

జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - దెందులూరు

దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతిఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే ఆచరించాలని, అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధులను కొంతవరకు అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్కాపురంలో డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ ప్రజలతో మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల స్వరాలు, ఇతర అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది తద్వారా ప్రాణాంతక వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. దోమకాటు కంటికి కనిపించదని, కాని దాని ద్వారా ముప్పు చాలా ఉందని చెప్పారు. నీటి తొట్టెలు వారానికొసారి శుభ్రపరచుకుని మూతలు పెట్టుకోవాలని, నీటి నిల్వ ప్రాంతాల్లో ఇంజన్ ఆయిల్ చల్లాలని సూచించారు. సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకోవాలని, దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి డెంగీ, మలేరియా కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య విస్తరణాధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ కిరణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, జోషి, ఆరోగ్య కార్యకర్త అభిలాష, ఎంఎల్హెచ్పి పావని, ఆశా కార్యకర్తలు గీత కుమారి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ

ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్రే లక్ష్యం

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి మే 21న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమం జిల్లాలో ముందుకెళ్తుందని, ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రణాళిక ప్రకారం జిల్లాలో దాదాపు ఎనిమిది లక్షల మందికి యోగాను చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 4.18 లక్షల మంది తమ పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఇప్పటికే యోగాభ్యాసకులకు శిక్షణ అందించేందుకు 6,226 మంది శిక్షకులు నమోదై ఉన్నారన్నారు. మండల స్థాయిలో గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో కనీసం 50 మందికి యోగాను చేరువ చేసేందుకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణ లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 వరకు జిల్లాలోని ప్రతి గ్రామ, పట్టణాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి వరకు యోగా సంబంధిత వివిధ స్థాయిల్లో వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు తెలిపారు.

పోలవరం : యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్బాబు అన్నారు. పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం ఎంపిడిఒ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమానికి గురువుగా డాక్టర్ బీరా విజయ్బాబు వ్యవహరించి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆటో ఎక్కే ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చింతలపూడి సిఐ రాజశేఖర్ అన్నారు. చింతలపూడిలో ఆటో డ్రైవర్లతో రహదారి ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిఐ రాజశేఖర్, ఎస్ఐ కుటుంబరావు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపేవారు ప్రయాణికులను గౌరవించాలన్నారు. సొసైటీలో మర్యాద రావాలంటే పిల్లలను చదివించుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. 181, 112, 9550351100 నెంబర్లు ప్రతి ఆటో వెనుక ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని, ఆటోలను రోడ్డుపై అడ్డంగా ఉండకుండా నిర్ణిత ప్రదేశాల్లోనే నిలుపుకోవాలన్నారు. డ్రైవర్లందరూ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.



ఫ్యాన్ అందిస్తున్న రాజా

అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్ లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారుల ఇబ్బందులపై స్పందించిన జన సైనికుడు కమటంశెట్టి రాజా తన సొంత ఖర్చులతో సీలింగ్ ఫ్యాన్ కొనుగోలు చేసి అంగన్వాడీ సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు పాశం నాగబాబు, టిడిపి నాయకులు రంగు బుజ్జి, ఉప్పే మోహన్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి వేట త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు ఈ నెల 31వ శనివారమే పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడిఒ జి.నగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు జూన్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగా మే 31వ తేదీన పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. టి.నరసాపురం మండలంలో పెన్షన్లు మే 31వ తేదీ శనివారం ఉదయం 6:30 గంటల నుంచి అందించనున్నట్లు తెలిపారు.

పాస్పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, శేరేపాలెం పంచాయితీ హరిజన పేటకు చెందిన నల్లి చిన వెంకటరత్నం, తండ్రి: నల్లి దేవ సహాయం అను నేను గ్రామంలో ఇంటి నుండి **నా పాస్పోర్టు నెంబర్ : X7118993** తో ద్విచక్ర వాహనంపై మొగల్తూరు జిరాక్స్ కాపీల నిమిత్తం వెళుతూ ఉండగా మార్గమధ్యంలో జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

నల్లి చిన వెంకటరత్నం
S/o. దేవ సహాయం
శేరేపాలెం, హరిజనపేట,
మొగల్తూరు మండలం,
డోర్ నెం. 2-127, పిన్ కోడ్: 534281
సెల్ నెం: 99597 84605